పరిషత్ ప్రతిపక్షనేతగా చలవాది నారాయణస్వామి

బెంగళూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): విధాన పరిషత్ ప్రతిపక్షనేతగా చలవాది నారాయణస్వామి ఎంపికయ్యారు. బీజేపీ అధిష్టానం ఈ మేరకు ప్రతిపక్షనేతగా నారాయణస్వామిని నియమించినట్లు ప్రకటించింది. ఏడాదిపాటు ప్రతిపక్షనేతగా కోట శ్రీనివాసపూజారి కొనసాగారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఆయన ఎంపీగా ఎన్నిక కావడంతో పరిషత్ స్థానానికి రాజీనామా చేశారు. దీంతో కొత్తగా ప్రతిపక్షనేతను ఎన్నుకునే విషయంలో అధిష్టానం ఆచితూచి వ్యవహరించింది. ప్రతిపక్షనేత హోదా కోసం సీటీ రవి తీవ్రంగా ప్రయత్నించారు. ఎట్టకేలకు చలవాదికి చాన్స్ దక్కింది. ఈ మేరకు చలవాది నారాయణస్వామిని పార్టీ కార్యాలయంలో పలువురు ఎమ్మెల్సీలు, పార్టీ ప్రముఖులు మంగళవారం ప్రత్యేకంగా సత్కరించారు.

రాష్ట్రానికి మొండిచేయి



నీటి ప్రాజెక్టులపై ఆశలు గల్లంతు

బెంగళూరు- హైదరాబాద్, బెంగళూరు - చెన్నై పరిశ్రమల కారిడార్లతోనే సరి

రాష్ట్రం నుంచి రాజ్యసభ ఎంపీగా నిర్మలా సీతారామన్

అయినా కేంద్ర బడ్జెట్‌లో నిరాశే..

రాష్ట్ర అభివృద్ధిపై పూర్తి నిర్లక్ష్యం : సీఎం

బెంగళూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌పై ఆశలు పెట్టుకున్న రాష్ట్రానికి మొండిచేయి మిగిలింది. కేంద్ర బడ్జెట్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో ఆశలు పెట్టుకుంది. ప్రత్యేకించి వెనుకబడిన కల్యాణ కర్ణాటక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.5వేల కోట్లు కేటాయిస్తోంది. ఈ ప్రాంతానికి ప్రత్యేక గ్రాంట్లు వస్తాయని ప్రభుత్వం భావించింది. పైగా రాష్ట్రంలో మహదాయి, మేకెదాటు, కృష్ణ ఎగువ నీటి ప్రాజెక్టులకు గ్రాంట్లు ఉంటాయని ఊహించింది. దేశంలోనే ఐటీబీటీ రంగాల్లో దూసుకుపోతున్న బెంగళూరు అభివృద్ధికి సహకారం ఉంటుందని ఆశించింది. ఏ విభాగానికి కూడా కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి గ్రాంట్లు లేకపోవడం సర్వత్రా నిరాశ కలిగించింది. హైదరాబాద్ - బెంగళూరు, బెంగళూరు - చెన్నై పరిశ్రమల కారిడార్‌లకు మాత్రమే అవకాశం దక్కింది. దేశవ్యాప్తంగా 12కారిడార్‌లలో ఇవి రెండుగా ఉన్నాయి. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర ప్రస్తావన లేకపోవడం రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనే అన్యాయం జరిగిందని చర్చలు జరుగుతున్నాయి. రాష్ట్రం నుంచి ఐదుగురు మంత్రులు ఉన్నా వారు పర్యవేక్షిస్తున్న శాఖలకు కూడా గ్రాంట్లను పొందలేకపోయారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రియల్ ఎస్టేట్‌కు మిశ్రమ ప్రయోజనం

కేంద్ర బడ్జెట్‌లో రియల్ ఎస్టేట్ రంగానికి మిశ్రమ ప్రయోజనాలు ఉన్నాయి. హౌసింగ్ విభాగంలో సకారాత్మకంగా నిర్ణయం తీసుకున్నారు. పరిశ్రమ ఎదుర్కొంటున్న పలు సవాళ్లకు బడ్జెట్ అనుకూలం కానుంది. జీఎస్టీ పరిహారం, అనుమతులు, రియల్‌రంగ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయనుంది. ప్రభుత్వానికి మేము సంపూర్ణంగా సహకరిస్తాం.

- అమర్ మైసూరు, అధ్యక్షుడు, క్రెడాయ్



మనుగడ కోసమే ప్రాధాన్యం : డీసీఎం



కేంద్ర ప్రభుత్వం మనుగడ సాధించేందుకే బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇచ్చారని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ అభిప్రాయపడ్డారు. విధానసౌధలో ఆయన మీడియాతో మాట్లాడుతూ బీహార్, ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు. కర్ణాటకతోపాటు పలు రాష్ట్రాలకు అన్యాయం జరిగిందన్నారు. ఇది కేవలం బీజేపీ, ఎన్డీయే కూటమి పార్టీలకు చేదోడు ఇచ్చే బడ్జెట్ అయిందన్నారు. ప్రధానమంత్రి, కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్‌లపై తాను ఎంతో విశ్వాసం పెట్టుకున్నా అని, ప్రపంచమే బెంగళూరును చూస్తోందని ఇక్కడ అత్యధిక ఉద్యోగాల సృష్టి సాధ్యమవుతోందని అన్నారు. ప్రధానమంత్రి బెంగళూరు మౌలిక సదుపాయాలకు, కర్ణాటకకు సాయం చేస్తారని భావించానన్నారు. అయితే నిర్లక్ష్యం చేశారని పేర్కొన్నారు.

రాష్ట్రానికి పంగనామాలు : సీఎం

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, ఏడు కోట్ల మంది కన్నడిగులకు చెంబు మిగిల్చారని, పంగనామాలు పెట్టారని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన 'ఎక్స్' వేదికగా బడ్జెట్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఇదే సందర్భంగా నగరంలో సీఎం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ కర్ణాటక పట్ల కనీస అభిమానం చూపలేదాయి, మేకెదాటు ప్రాజెక్టుల ప్రస్తావన లేకుండా రైతులకు మోసం చేశారని విమర్శించారు. 15వ ఫైనాన్స్ కమిషన్ సిఫారసులకు అనుగుణంగా పెరిఫెరల్ రింగ్‌రోడ్డు, చెరువుల అభివృద్ధి, బెంగళూరు నగరాభివృద్ధి ప్రాజెక్టులకు రూ.11,485 కోట్లు కోరామన్నారు. రాయచూరులో ఎయిమ్స్ స్థాపించేందుకు వినతిని ఇచ్చామన్నారు. వీటి ప్రస్తావనే లేదన్నారు. బడ్జెట్‌లో రైతులకు తీరని అన్యాయం చేశారన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసులను ప్రస్తావించలేదన్నారు. రాష్ట్రం నుంచి ఐదుగురు మంత్రులు ఉన్నా బడ్జెట్‌లో గ్రాంట్లు పొందలేకపోయారన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు గ్రాంట్లలో కోతలు పెట్టారన్నారు. కేంద్ర 16వ ఆర్థిక కమిషన్ ఆగస్టు 28న రాష్ట్రానికి రానుందని అప్పుడు కర్ణాటకకు జరిగిన అన్యాయంపై విన్నవిస్తామన్నారు.

దన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధికారాన్ని కాపాడుకునేందుకు ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకు ప్రత్యేక గ్రాంట్లు ఇచ్చి ఇతర రాష్ట్రాలను విస్మరించారని అన్నారు. బడ్జెట్‌కు ముందు రాష్ట్రం నుంచి పలు వినతులు ఇచ్చామని, ఏ ప్రాజెక్టుకు పైసా విదల్చలేదని అన్నారు. భద్ర ఎగువ ప్రాజెక్టుకు ఇప్పటికే రూ.5,300 కోట్లు కేటాయించినా వాటి ప్రస్తావన లేదన్నారు. కల్యాణ కర్ణాటక అభివృద్ధికి రాష్ట్రం నుంచి రూ.5వేల కోట్లు సమకూరుస్తున్నామని, వెనుకబడిన తాలూకాలకు గ్రాంట్లు కోరామని, మహ



ఇది అమృతకాలపు బడ్జెట్ - కేంద్రమంత్రి కుమారస్వామి



బెంగళూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఇది అమృతకాలపు బడ్జెట్ అని, అన్నివర్గాలకు అనుకూలమైనదని కేంద్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి కుమారస్వామి పేర్కొన్నారు. ఢిల్లీలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆశయాలకు అనుగుణంగా వికసిత భారత్ నిర్మాణానికి శక్తి నింపిందన్నారు. మహిళలకు అత్యధికంగా అనుకూలం చేయడం ద్వారా నారీశక్తి బడ్జెట్‌గా ఉందని కొనియాడారు. 9 ప్రాధాన్యాత విభాగాలను గుర్తించారని విద్య, ఉద్యోగం, నైపుణ్యతకోసం రూ.1.48 లక్షల కోట్లతో నాలుగు కోట్ల మందికి ఉద్యోగం కల్పించే లక్ష్యంగా ఉందన్నారు. మానవ వనరులను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాల సృష్టిలో నిర్ణయాత్మకమైన పాత్ర పోషించే చిన్న, మధ్య తరహా పరిశ్రమకు ఆర్థికంగా నింపేలా ఉందన్నారు. ఇది దూరదృష్టి కలిగిన బడ్జెట్ అని వ్యవసాయ, పరిశ్రమల, మౌలిక సదుపాయాలు ఉద్యోగాల సృష్టికి ప్రాధాన్యత ఇచ్చారన్నారు. బెంగళూరు - చెన్నై, హైదరాబాద్ - బెంగళూరుతో కలిపి 12 పారిశ్రామిక కారిడార్‌లను కల్పించడం ఉద్యోగ, ఆర్థిక వృద్ధికి ఊతమివ్వనుందన్నారు. ఆహార పదార్థాల డిమాండ్‌కు అనుగుణంగా వ్యవసాయాన్ని చైతన్యం చేయడం, వ్యవసాయ పరిశోధనలు అభివృద్ధికి బడ్జెట్ ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. పంటలను డిజిటల్ సమీక్ష చేసే ప్రాజెక్టును 400 జిల్లాలకు విస్తరించడం సంతోషదాయకమన్నారు. రాష్ట్రాలకు 50ఏళ్ల వడ్డీ రహిత రుణాలను ప్రకటించడం స్వాగతించే అంశమన్నారు.

మేకిన్ ఇండియాకు అనుకూలం



2047 నాటికి దేశాన్ని పెన్షన్ సొసైటీగా మార్చాలనే ప్రభుత్వ లక్ష్యంవైపు గణనీయమైన ఆలోచన ఉంది. కార్పొరేట్ ఎన్‌పీఎస్ కింద అదనపు 4శాతం సహకారం వేతన ఉద్యోగులకు అదనపు పన్ను ఆదాను అందిస్తుంది. పదవీ విరమణ నిధులను పెంచుతుంది. ఎన్‌పీఎస్ వాత్సల్యా మరొక ముఖ్యమైన ఆవిష్కరణ. ఇది తల్లిదండ్రులు, సంరక్షకులు పుట్టినప్పటి నుంచి పిల్లల పెన్షన్‌కు సహకరించడానికి వీలు కానుంది. కాంపౌండ్ రిటర్న్ ద్వారా భవిష్యత్తులో పదవీ విరమణ పొదుపుకోసం బలమైన పునాది.

-శ్రీరామ్ అయ్యర్, సీఈఓ, హెచ్‌డీఎఫ్‌సీ పెన్షన్ స్కీమ్

సాగు రంగంపై ప్రత్యేక దృష్టి



ఆర్థిక లోటును 4.9 శాతం ఉంచడం ద్వారా ఆర్థిక ఏకీకరణ వైపు గ్లైడ్ మార్గాన్ని కొనసాగిస్తూ మౌలిక సదుపాయాలు, సామాజికరంగానికి ప్రాధాన్యత ఇచ్చారు. వ్యవసాయ రంగంలో ఉత్పాదకత పెంచడం, రైతుల సంక్షేమంపై దృష్టి సారించడం, శ్రామికశక్తిలో మహిళల భాగస్వామ్యం పెంచడం సంతోషకరం. ఎంఎస్ఎంఈ, తయారీ రంగంపై ప్రత్యేక ప్యాకేజీలు జాతీయ జీడీపీ పెంపునకు దోహదపడుతుంది.

- విక్రమ్ గులాటి, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, టయోటా కిర్లోస్కర్

పారిశ్రామిక నైపుణ్యాలకు పెద్దపీట



పారిశ్రామిక నైపుణ్యాలకు అనుగుణంగా స్కిల్ డెవలప్‌మెంట్‌లకు ప్రాధాన్యత ఇవ్వడం పెద్దపీట వేసినట్టయ్యింది. దేశీయ విద్యాసంస్థలు విద్య కోసం పెంచిన రుణపరిమితి నుంచి ప్రయోజనం పొందుతాయి. విదేశీ విద్యకోసం రుణాల ప్రోత్సాహకాలను తొలగించాల్సిన అవసరం లేదు. ఎంఎస్ఎంఈలకు ప్రత్యేకించి యువతకు నైపుణ్యత కలిగించేందుకు బడ్జెట్‌లో కేటాయింపులు సంతోషకరం. ఉద్యోగాలు సృష్టించడానికి ప్రోత్సాహం ఇచ్చారు.

- మధువీర రాఘవన్, వీసీ, మణిపాల్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్

యువతకు ప్రోత్సాహం



కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ యువత, విద్యార్థులను ప్రోత్సహించేలా ఉంది. విద్య, ఉద్యోగం, నైపుణ్యత కోసం రూ. 1.48 లక్షల కోట్లు కేటాయించడం విద్యారంగం రూపురేఖల్లో మార్పునకు దోహదం చేస్తుంది. నైపుణ్యాభివృద్ధి కోసం కోటి మంది యువతకు ఇంటర్న్‌షిప్ కల్పించే ప్రభుత్వ మహత్తరమైన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. నైపుణ్యత, ఉద్యోగసృష్టిపై కేంద్రీకరించడం ద్వారా విద్యార్థులు భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధమవుతారు. ఆర్థిక, సామాజిక ప్రగతికి బడ్జెట్ దోహదపడుతుంది. ఉన్నత విద్యారంగంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్న రేవా యూనివర్సిటీ ఈ ప్రోత్సాహాలను అభినందిస్తోంది.

- డాక్టర్ పి.శ్యామరాజు, చాన్స్‌లర్, రేవా యూనివర్సిటీ

సామాజిక, ఆర్థిక లక్ష్యాలపై దృష్టి



మధ్యంతర బడ్జెట్‌లో కీలక సామాజిక, ఆర్థిక లక్ష్యాల కొనసాగింపుపై దృష్టి సారించించారు. మౌలిక సదుపాయాలరంగాన్ని ప్రోత్సహించారు. నిర్మాణాత్మక సమస్యల పరిష్కారానికి బడ్జెట్ లోతుగా సాగింది.

- మనీష్‌కొఠారి, కోటక్ మహీంద్ర బ్యాంక్

ఈడీపై కేసు నమోదు..

అట్టుడికిన శాసనసభ

ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు బీజేపీ కుట్ర

కాంగ్రెస్ సభ్యుల ఆగ్రహం

సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల నిరసన

బెంగళూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో అవినీతికి సంబంధించి ఈడీపై కేసు నమోదు అంశం శాసనసభను అట్టుడికించింది. అవినీతి కేసును విచారిస్తున్న ఈడీ అధికారులు, కార్పొరేషన్ అడిషనల్ డైరెక్టర్ కల్లేశప్పను ముఖ్యమంత్రి సిద్దరామయ్య పేరు చెప్పాలని వేధిస్తున్నారంటూ విల్సన్‌గార్డెన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అంశాన్ని కాంగ్రెస్ ఎమ్మెల్యే శివలింగేగౌడ వాయిదా తీర్మానాన్ని కోరారు. ఈడీని ఉపయోగించుకుని ప్రజాప్రభుత్వాన్ని ఇరుకునపెట్టాలని బీజేపీ భావిస్తోందన్నారు. అందుకు స్పీకర్ యూటీ ఖాదర్ స్పందిస్తూ వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టలేమని, కానీ 69వ నిబంధనకింద చర్చకు అవకాశం ఇస్తామన్నారు. శివలింగేగౌడ మాత్రం వాయిదా తీర్మానానికి పట్టుబట్టారు. దీంతో ప్రతిపక్ష సభ్యులు అధికార పార్టీ సభ్యుల తీరుపై విరుచుకుపడ్డారు. సుమారు అరగంటపాటు ఇదే అంశంపై చర్చ జరిగింది. కాగా శాసనసభలో కర్ణాటక సినీ సాంస్కృతిక కళాకారుల సవరణ బిల్లును ప్రవేశపెట్టారు.



మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నిరసనలో సీఎం, డీసీఎం తదితరులు

గ్రేటర్ బెంగళూరు బిల్లుపై బీజేపీ అభ్యంతరం

గ్రేటర్ బెంగళూరు ప్రాధికార ఏర్పాటుకు బిల్లును ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రవేశపెట్టడంపై బీజేపీ సభ్యులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంగళూరు విభజన ద్వారా కెంపేగౌడ శాపం తప్పదని ప్రతిపక్షనేత అశోక్ మండిపడ్డారు. బెంగళూరును ఛిద్రం చేయాలనే మీ ఆలోచన సరికాదన్నారు. బెంగళూరు నగర ఎమ్మెల్యేల కమిటీ అధ్యయనం చేయాలని, ఆ తర్వాత నిర్ణయం తీసుకోవాలని బీజేపీ సభ్యుడు సురేశ్‌కుమార్ తెలిపారు. ఇటీవలే రామనగరను బెంగళూరు దక్షిణ జిల్లా చేస్తామని ప్రతిపాదించారని, తాజాగా గ్రేటర్ బెంగళూరు పేరిట మరో కొత్త ఎత్తుగడకు సిద్ధమయ్యారని మండిపడ్డారు. గ్రేటర్ బెంగళూరులో దాసరహళ్లి, రాజరాజేశ్వరినగర్, కేఆర్ పురం, బొమ్మనహళ్లి, మహదేవపుర, యలహంకతోపాటు 7 నగర సభలు, కెంగేరి పురసభ గ్రేటర్ బెంగళూరు పరిధిలోకి రానుంది. బెంగళూరు విస్తీర్ణం 226 చదరపు కిలోమీటర్ల నుంచి 741 చదరపు కిలోమీటర్లకు విస్తరించనుంది. ఇక పరిషత్‌లో గదగ్ జిల్లా భూ ఆక్రమణలు, క్వారీలు నిషేధించాలని బీజేపీ సభ్యుడు సంకనూరు ప్రశ్నకు మంత్రి ఎస్ఎస్ మల్లికార్జున సమాధానమిచ్చారు. గ్రామపంచాయతీలలోనే ప్లాన్ అప్రూవల్ చేయాలనే డిమాండ్‌ను నగర పాలక శాఖ మంత్రి బైరతి సురేశ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీలలో సాంకేతిక సిబ్బంది ఉండరని, సాధారణ క్లర్కులతో అటువంటి ప్రక్రియ కొనసాగించలేమని స్పష్టం చేశారు. పరిషత్‌లో ప్రశ్నోత్తరాల వేళ వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ అవినీతి విషయమై చర్చలో కాంగ్రెస్ సభ్యుడు యతీంద్ర మాట్లాడుతూ కేంద్ర దర్యాప్తు సంస్థలు రాజకీయ దురుద్దేశ్యంతో వ్యవహరిస్తున్నాయన్న ఆరోపణలకు సభాపతి హొరట్టి స్పందిస్తూ నీవు కూర్చో నీకు అర్థం కాదంటూ మండిపడ్డారు.

విధానసౌధ ప్రాంగణంలో కాంగ్రెస్ నిరసన

ఈడీ అధికారులు సీఎం సిద్దరామయ్యను అవినీతి కేసులో ఇరికించేందుకు కుట్ర పన్నుతున్నారని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. విధానసౌధ ప్రాంగణంలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేశారు. సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్, మంత్రులు, ఎమ్మెల్యేలందరూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీఎం మాట్లాడుతూ సీఎంలు అరవింద్ కేజ్రీవాల్, సోరన్ తరహాలోనే సిద్దరామయ్యను ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.



బీబీఎంపీ ఇక..

గ్రేటర్ బెంగళూరు అథారిటీ

ఐదు జోన్లు..

400 వార్డులు

కేబినెట్ నిర్ణయం

శాసనసభ ఆమోదమే తరువాయి

ఇప్పట్లో ఎన్నికలు లేనట్టే...?

బెంగళూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఆసియా ఖండంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందడంతోపాటు విస్తరిస్తున్న బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ)ను పాలనా సౌలభ్యాల కోసం విభజించాలనే ప్రక్రియకు తుదిరూపు దిద్దారు. గతంలో 3 లేదా 5 భాగాలు చేయాలని భావిస్తున్న ప్రభుత్వం ఏకంగా మూడు విడతల పాలనా వ్యవస్థ, గరిష్ఠంగా 10 పాలికెలను అనుసంధానం చేసుకుని గ్రేటర్ బెంగళూరు పాలనా బిల్లుకు మంత్రివర్గం సోమవారం ఆమోదం తెలిపింది. ఐదు జోన్లు, 400 వార్డులుగా విభజిస్తారు. శాసనసభ ఉభయసభలు ఆమోదించడమే తరువాయిగా ఉంది. బీబీఎంపీని విభజించి ఐదు పాలికెలుగా చేయాలనే గత ప్రస్తావనకు మార్పు చేసి మహానగరంలోని అన్ని ప్రదేశాలను విలీనం చేసుకుంటూ సమతుల్యమైన అభివృద్ధి కోసం గ్రేటర్ బెంగళూరు అథారిటీ (జీబీఏ) ఏర్పాటు చేయాలనే బిల్లును సిద్ధం చేశారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య అధ్యక్షతన బిల్లు ఏర్పాటుకు కమిటీ సిద్ధం కానుంది. బెంగళూరు నగరాభివృద్ధి మంత్రి సదరు కమిటీకి ఉపాధ్యక్షుడిగా వ్యవహరించనున్నారు. నగర పరిధిలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, పాలికె ముఖ్య కమిషనర్‌తో కలిపి 21 మంది సభ్యులు ఉంటారు. ఈ కమిటీకి కీలక నిర్ణయాలు తీసుకునే అధికారం ఉంటుంది. నగరాభివృద్ధికి సంబంధించి మార్గదర్శకాలు చేస్తారు. రెండో విడతలో పాలికెలను నిర్వహిస్తారు. మూడో విడతలో వార్డు సభలు అస్థిత్వానికి రానున్నాయి. బెంగళూరు అభివృద్ధికి ప్రతినిధులుగా ప్రభుత్వం అన్ని సంస్థల సమన్వయంతో పనిచేసేలా ప్రాధికారకు మార్గదర్శకాలు చేయనుంది. పాత పద్ధతులను సమూలంగా మార్పులు చేసి కొత్త వ్యవస్థను తీసుకురానున్నారు. బిల్లులో 25 విభాగాలు, 169 పేజీలతో గ్రేటర్ బెంగళూరు అథారిటీ వివరించారు. ప్రతి కార్పొరేషన్ పరిధిలోనూ అక్కడి మేయర్, కమిషనర్, జాయింట్ కమిషనర్, స్థాయి సమితి, సర్కిల్ సమితి, వార్డు, ఏరియా సభలకు ఎక్కువ అధికారాలు ఇస్తారు. ఇక స్థాయి సమితుల గరిష్ఠంగా 6కు మించరాదనే నిబంధన విధించారు. బీబీఎంపీలో 12 స్థాయి కమిటీలు ఉన్నాయి. కొత్తగా ఏర్పాటు చేసే పాలికెలలో కేవలం 6 మాత్రమే ఉంటాయి. పాలనా వ్యవహారాలు, విద్య, సామాజిక న్యాయం, రెవెన్యూ, ఆర్థిక ఆడిట్, పబ్లిక్ వర్క్స్, ఇంజనీరింగ్ విభాగం, వైద్యం, విపత్తుల నిర్వహణ, అటవీ, పరిసరాలు, చెరువులు, ఉద్యానవనశాఖ, టౌన్‌ప్లానింగ్ కమిటీలు ఏర్పాటు చేసి ప్రతి కమిటీలో ఐదుగురు సభ్యులను నియమిస్తారు. కొత్తగా అస్థిత్వానికి వచ్చే పాలికె పరిధిలో అక్కడి నిబంధనల ఆధారంగా ఆస్తి పన్ను ఏర్పాటు చేసుకుంటారు. అదనంగా నిధుల సేకరణ కోసం వేర్వేరు విధాలుగా సెస్ వేసే అధికారం ఉంటుంది. ఆలస్యంగా పన్నులు చెల్లిస్తే 9 శాతం జరిమానా విధించే అవకాశం ఉంది.


ఐదేళ్ల పదవీ కాలం

బీబీఎంపీలో ప్రస్తుతం ఏటా మేయర్, ఉపమేయర్‌ను ఎన్నుకునే విధానం ఉంది. గ్రేటర్ బెంగళూరు ప్రాధికార అయితే ఐదేళ్లకు మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక చేస్తారు. కార్పొరేటర్‌గా పోటీ చేసేవారి వయస్సు 21 సంవత్సరాలుగా నిర్ణయించారు. గ్రేటర్ బెంగళూరు అథారిటీలో కార్పొరేషన్, వార్డు కమిటీలు, మూడు విడతల పాలనా వ్యవస్థ ఉంటుంది. 10 లక్షల జనాభాకు తక్కువ కాకుండా ఉండేలా గరిష్ఠంగా 10 పాలికెలు ఉంటాయి. బెంగళూరు నగర, గ్రామీణ జిల్లా, ప్రభుత్వం నిర్దేశించిన ఇతర ప్రాంతాలు బీఎంఆర్‌డీఏ పరిధిలో ఉంటాయి. పాలికెలు ప్రభుత్వ సంస్థల సమన్వయం ద్వారానే పన్నులు నిర్వహించాల్సి ఉంటుంది. ప్రధాన కమిషనర్ పాలనా వ్యవహారాలను నిర్వహిస్తారు. మిగిలిన పాలికెలను సీనియర్ అధికారులకు బాధ్యతలు అప్పగిస్తారు. గ్రేటర్ బెంగళూరు ముఖ్య కమిషనర్ అధ్యక్షతన మూడు నెలలకోసారి పాలనా వ్యవస్థపై సమీక్షలు చేస్తారు. ఆర్థిక వనరుల కోసం ప్రత్యేకంగా నగరాభివృద్ధిశాఖ మంత్రి నేతృత్వంలో ఆర్థిక అభివృద్ధి ఏజెన్సీ ఏర్పాటు కానుంది. పాలికెల ఆస్తుల రక్షణకు గ్రేటర్ బెంగళూరు టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. పన్నుల నియంత్రణ, చెత్త పర్యవేక్షణ, నీరు, విద్యుత్, ఫ్లై ఓవర్‌ల నిర్మాణం, భారీ రోడ్ల నిర్మాణాలను కమిటీ నిర్ధారిస్తుంది. బడ్జెట్‌కు ఆమోదించి పాలికెలకు ఎక్కువ గ్రాంట్లు కేటాయించే అధికారం గ్రేటర్ బెంగళూరుకు ఉంటుంది. నగరంలోని అన్ని ప్రభుత్వ ఆస్తులు పాలికె పరిధిలోకి చేరుతాయి. పబ్లిక్ సర్వీస్ కోసం లీజ్ రూపంలో కేటాయించే అధికారం ప్రధాన కమిషనర్‌కు ఉంటుంది.

మరింతకాలం ఎన్నికలు లేనట్టే..

బృహత్ బెంగళూరు మహానగర పాలికెకు మరింతకాలం ఎన్నికలు లేనట్టేని తెలుస్తోంది. ఇప్పటికే పాలక వర్గం లేక దాదాపు మూడేళ్లు కావస్తోంది. ప్రస్తుతం గ్రేటర్ బెంగళూరుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తున్న తరుణంలో ఎన్నికలు మరింత జాప్యమయ్యే అవకాశాలు ఉన్నాయి.





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1629.16	1,599.87
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	92,636	54, 657
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	11657	125
సామర్థ్యం (టీఎంసీలు)	90.94	21.36

నిండుకుండలా తుంగభద్ర డ్యాం

బళ్లారి, కంప్లి, జూలై 23(ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల ఉమ్మడి నీటి ప్రాజెక్టు అయిన తుంగభద్ర డ్యాం నీటితో నిండుకుండలా తొణికిసలాడుతోంది. పైప్రాంతంలో కురిసిన భారీవర్షాలకు డ్యామ్‌కు వరదనీరు భారీగా చేరుతోంది. మంగళవారం సాయంత్రం అధికారుల లెక్కల ప్రకారం జలాశయంలోకి 93.46 టీఎంసీల నీరు చేరింది. 87,137 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, క్రస్ట్‌గేట్లు ఎత్తి వెయ్యి క్యూసెక్కుల నీటిని నదిలోకి విడుదల చేస్తున్నారు. డ్యామ్‌కు వున్న వివిధ కాలువలకు 15,159 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కాలువలకు నీరు విడుదల చేయండంతో రైతులంతా వరినాట్లు వేసుకోవడానికి సమాయత్తమవుతున్నారు. గత సంవత్సరం అనుభవం దృష్ట్యా ఇప్పటిదాకా డ్యాం నిండుతుందా లేక గత సంవత్సరంలాగా పరిస్థితి ఉంటుందా అని అనుమానపడిన రైతులు ఈ ఏడాది నిండుగా నీరు చేరడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇంజనీరింగ్ అధికారులు అధికారులు అప్రమత్తంగా వుంటూ ఎలాంటి సంఘటనలు జరుగకుండా చర్యలు చేపట్టారు.



నీటితో తొణికిసలాడుతున్నటీబీ డ్యాం



హావరగుంది వద్ద పొంగి ప్రవహిస్తున్న శివయ్య వాగు

గ్రామాల్లోకి చేరిన వరదనీరు

తుంగభద్ర వరద కారణంగా విజయనగర జిల్లా హరప్పనహళ్లి తాలుకా పరిధిలోని హావరగుంది, నిట్టూరు, బసాపుర, తదితర గ్రామాల్లోకి నీరు చేరింది. రైతులు కూడా తమ పొలాల్లోకి నీరు చేరడంతో కాస్త ఇబ్బంది పడుతున్నారు. అలాగే గ్రామాల్లో రోడ్లపై నీరు నిలబడడంతో కొంతవరకు ప్రయాణీకుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మొత్తానికి జలాశయంలోకి నీరు లక్ష క్యూసెక్కులకు పైగా వస్తుండడంతో తుంగభద్ర నదీతీరాన సహాయ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

ఘనంగా కార్గిల్ రజతోత్సవాలు



త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తున్న పతంజలి పరివార్

బళ్లారి సిటీ,జూలై 23: కార్గిల్ యుద్ధంలో పాకిస్తాన్ పై భారత్ విజయం సాధించిన సందర్భంగా యువజన దళం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న త్రివర్ణ పతాకం ఊరేగింపు మంగళవారం హొస్పేటకు చేరుకుంది. నగరం, పతంజలి పరివార్ యువ బ్రిగేడ్ కన్వీనర్ చంద్రశేఖర్ త్రివర్ణ పతాకంతో కొట్టూరు స్వామి మఠం ప్రాంగణానికి రావడంతో విశ్రాంత సైనికులు అశోక్‌చిత్రాగర్, సతీశ్‌రావు, శ్రీనివాసులు జెండాను ఎగురవేసి సభా వేదికపైకి తీసుకురావడంతో జనం పూల వర్షం కురిపించారు. యోగా గురువు గోకర్ణ నాగేంద్ర భట్, పలువురు పెద్దలు రిటైర్డ్ సైనికులతో కలిసి జెండాను ఎగురవేశారు.

పాక్‌తో భారత్ స్నేహ ఒప్పందం చేసుకున్న తర్వాత పాకిస్తాన్ వెన్నుపోటు పొడిచిందని చంద్రశేఖర్ అన్నారు. మన వీర సైనికులు అత్యంత కష్టతరమైన కొండ ప్రాంతాలైన కార్గిల్ , ద్రాస్‌లలో దేశం కోసం గొప్ప త్యాగాలు చేసి అద్భుతమైన విజయాన్ని సాధించారన్నారు. అలాంటి అమరవీరులను మనమందరం స్మరించుకోవాలన్నారు. ఈసందర్భంగా పతంజలి యంగ్ ఇండియా స్టేట్ హెడ్ కిరణ్‌కుమార్, సీనియర్ యోగా అభ్యాసకులు శివమూర్తి, నాగేంద్ర భట్ విఠోబన్న, మంగళమ్మ, ప్రమీలమ్మ,రాజేశ్ కర్వ, అనంతజోషి,పలువురు సీనియర్ యోగా నిపుణులు పాల్గొన్నారు.

ఫసల్ బీమా కోసం నమోదు చేసుకోవాలి



బళ్లారి సిటీ, జూలై 23: జిల్లాలోని రైతులందరూ తమ పంటలను ఫసల్ బీమా యోజన కింద నమోదు చేసుకుని ఈపథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో ప్రధానమంత్రి పసల్ బీమా యోజన కింద పంట బీమా కోసం నమోదు చేసుకోవడానికి పంట రుణాలు పొందిన, పంట రుణాలు పొందని రైతులు కూడా తమ పంటలకు బ్యాంకుల నుండి బీమా చేయించుకోవాలన్నారు. మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, కంది, పత్తి, మిర్చి, ఉల్లిపంటలకు జూలై 31 చివరిరోజని, మినుము, కొర్రలు, ఉలవలు, వేరుశనగ వంటి వరాధార పంటలకు, సజ్జ, కంది, వరి వంటి సాగు నీటి పంటలకు ఆగస్టు 16చివరి రోజని తెలిపారు. ఈపథకం ప్రయోజనాన్ని పొందేందుకు రైతులు ఫ్రూట్స్ సాఫ్ట్‌వేర్‌లో అందుబాటులో ఉన్న ఎఫ్ఐడీ నంబర్‌తో పాటు ఆధార్, బ్యాంక్ ఖాతాను ఫీడ్ చేయాలన్నారు. ఆధార్ కార్డు జిరాక్స్, పహాణీ పేపర్, బ్యాంకు పాస్ బుక్ కాపీలతో స్థానికంగా ఉన్న ఏదైనా బ్యాంకు, సాధారణ సేవా కేంద్రాలు. గ్రామపంచాయితీల్లో కొత్తగా పనిచేస్తున్న గ్రామ వన్ మీసేవా కేంద్రాలను సందర్శించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

పింజారీల అభివృద్ధికి నిధులివ్వాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

సిరుగుప్ప, జూలై 23 : పింజరి సమాజ అభివృద్ధికి ప్రత్యేక నిధులను విడుదల చేయాలని జిల్లా పింజరి సమాజం అధ్యక్షులు నబీసాబ్ కోరారు. మంగళవారం సిరుగుప్ప డిప్యూటీ తహసీల్దార్ రాఘవేంద్రకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నబీసాబ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 25 లక్షలు పింజరి సమాజం ప్రజలు ఉన్నట్లు తెలిపారు. ఆర్థికంగా, సాంఘీకంగా రాజకీయంగా ప్రాధాన్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పింజరి సమాజం ప్రముఖులు ఖాజాసాబ్, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

ఇక్కడ అతివృష్టి... అక్కడ అనావృష్టి

బళ్లారి.. విజయనగర జిల్లాల్లో భిన్నమైన పరిస్థితులు

బళ్లారి, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : బళ్లారి, విజయనగర జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో అతివృష్టి, మరికొన్ని చోట్ల అనావృష్టి నెలకొంది. వర్షాలు కురవని కారణంగా మెట్ట పంటలు సాగు లేక కొన్ని భూములు బీళ్లు పడ్డాయి. కనీసం వేసిన విత్తనం కూడా మొలకెత్తక రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు. జిల్లాలోని మరో ప్రాంతంలో భారీ వర్షాలు కురిసి పంటలన్నీ అతివృష్టి ఇబ్బందిపెడుతోంది. బళ్లారి జిల్లాలో మొత్తం 4.43 లక్షల హెక్టార్లభూములు వున్నాయి. తుంగభద్రజలాశయం కింద వున్న మాగాణి భూములన్నింటినీ సాగుకు సిద్ధం చేశారు. సుమారు 1.73 లక్షల ఎకరాల వర్షాధారిత భూములు వర్షం లేక బీడుపడ్డాయి. ఇందులో 80 శాతం వరకు పంటలు విత్తనే లేదని వ్యవసాయ శాఖాధికారులు పేర్కొన్నారు. తుంగభద్ర జలాశయం నీటితో 1.59 లక్షల హెకార్లలో రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు.

అయితే జిల్లా వ్యాప్తంగా వర్షాధారం కింద వున్న భూములు వర్షం లేక బీడు పడే ప్రమాదం వుంది. బళ్లారి జిల్లాలో వర్షాధారం కింద వున్న హరప్పనహళ్లి, కూడ్లిగి, హగరి బొమ్మనహళ్లి, హువిన అడగళి ప్రాంతాల్లో పూర్తిగా విత్తనం వేయక రైతులు ఇబ్బంది పడుతున్నారు. విత్తనాలు వేసేందుకు చివరి రోజైన జూలై 15 దాటిపోయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇదిలా వుంటే రాష్ట్రంలోని సుమారు ఎనిమిది జిల్లాల్లో వర్షపాతం లేక పంటలు వేయలేదు. మలేనాడు, కరావళి, బెల్గామ్‌లోని కొన్ని ప్రాంతాల్లో విపరీతమైన వర్షం కురుస్తోంది. అలాగే ఉత్తరం, మైసూరు భాగంలోని కొన్ని జిల్లాల్లో వర్షం సరిగా పడని కారణంగా రైతులు విత్తనాలు వేయలేకపోయారు. కర్ణాటక రాష్ట్రంలో జూలై నెల నాటికి కేవలం 23.3 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి వుండగా 18.3 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదయింది. చాలా చోట్ల వర్షం పడలేదు. మలేనాడులో మాత్రమే 61.5 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. మిగిలిన ఎనిమిది జిల్లాల్లో సరిగా వర్షం కురవలేదు. దీంతో రాష్ట్రంలో కొంతవరకు అనావృష్టితో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



వర్షాలు రాక బీళ్లుగా వున్న భూములు

రాయచూరులో ఎయిమ్స్ ఏర్పాటు చేయాలి

ఎయిమ్స్ పోరాట సమితి అధ్యక్షుడు మల్లికార్జున్



మహాత్మా గాంధీ స్టేడియం వద్ద దీక్ష చేస్తున్న నాయకులు

రాయచూరు, జూలై 23: విద్యాపరంగా అత్యంత వెనకబాటుతనానికి గురైన రాయచూరు జిల్లాకు ఎయిమ్స్ మంజూరు చేసే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని ఎయిమ్స్ పోరాట సమితి సభ్యుడు మల్లికార్జున్ అన్నారు. ఎయిమ్స్ ఏర్పాటుతోనే జిల్లాకు తగిన న్యాయం లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఎయిమ్స్ ఏర్పాటు కోసం అఖిలపక్షం, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక నిరాహారదీక్ష మంగళవారం 803వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే జిల్లాకు ఐఐటీ ఇస్తామని చెప్పిన పాలకులు దాన్ని ఇతర జిల్లాకు తరలించడం జిల్లా ప్రజలను తీవ్ర ఆవేదనకు గురి చేసిందన్నారు. రాయచూరు జిల్లాలో ఎయిమ్స్ ఏర్పాటుకు సంబంధించి స్థానిక ప్రజాప్రతినిధులు ఏనాడూ నోరు విప్పకపోవడం బాధ్యత రాహిత్యమన్నారు. తమ పోరాటాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిగణలోకి తీసుకుని ఈ ప్రాంత ప్రజల అవసరాన్ని గుర్తించి తగిన న్యాయం చేయాలన్నారు.

తక్కువ ఖర్చుతో వైద్యం అభినందనీయం

ఎఫ్‌పీఏఐ అమృతమహోత్సవంలో అదనపు కలెక్టర్ మహ్మద్‌జుబేరా

బళ్లారి సిటీ, జూలై 23: బళ్లారిలో దాదాపు 50ఏళ్లుగా నిర్వహిస్తున్న ఫ్లానింగ్ అసోషియేషన్ ఆఫ్ ఇండియా నిజంగా అభినందనీయమైన సంస్థ అని బళ్లారి జిల్లా అదనపు జిల్లాకలెక్టర్ మహ్మద్ జుబేరా అన్నారు. నగరంలోని ఫ్యామిలీ ఫ్లానింగ్ అసోషియేషన్ కార్యాలయంలో మంగళవారం అమృత మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. తక్కువ ఖర్చుతో ఇప్పటికీ వైద్యం అందిస్తున్న ఎఫ్‌పీఏఐ సంస్థను చూసి చాలా సంతోషించానని, ఈసంస్థలో పరిశుభ్రత ఆరోగ్యకరమైన వాతావరణం చూస్తే ఈ ఆస్పత్రి ఎంత బాగుందో తెలుస్తుందన్నారు. తదనంతరం ఉచిత సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపును ప్రారంభించిన బళ్లారి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అయ్యనగౌడ పాటిల్ మాట్లాడుతూ నైతికతతో ఈసంస్థ తన పనిని తాను చేస్తోందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బళ్లారి కుటుంబ సంక్షేమ ప్రాజెక్టు అధికారి డాక్టర్ పూర్ణిమ కట్టిమణి మాట్లాడుతూ కౌమార విద్య, లైంగికత, పునరుత్పత్తి, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్, బ్రెస్టు క్యాన్సర్ స్క్రీనింగ్, గర్భిణులు, బాలింతలకు సంబంధించిన సమాచారాన్ని ఎఫ్‌పీఏఐ అందిస్తుందన్నారు. ఒక స్వచ్ఛంద సంస్థ అన్ని అడ్డంకులను అదిగమించి 75సంవత్సరాలను పూర్తిచేసుకోవడం నిజంగా అభినందనీయమన్నారు. గైనాకాలజిస్టు డాక్టర్ రుక్సార్ బానురా 75మందికి పైగా మహిళలకు గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించారు. ఫామిలీ ఫ్లానింగ్ అసోషియేషన్ జిల్లాధ్యక్షుడు టి.జి.విఠల్ మాట్లాడుతూ ప్రజలకు రాయతీపై హెచ్‌పివి వ్యాక్సినేషన్‌ను అందజేస్తున్నామన్నారు. ఎఫ్‌పీఏఐలో టెక్నాలజీ స్మార్ట్‌స్కోప్ అందుబాటులో ఉందన్నారు. అమృత మహోత్సవంలో సంస్థ ఆవరణ ఎదుట రోడ్డుపై 20కిపైగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో భారత కుటుంబ నియంత్రణ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు విజయసింహ, బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ చందన, అడ్వైజర్ డాక్టర్ బాగ్య, సభ్యులు విష్ణు, అహిరాజ్,ప్రశాంత్ కేణి, గిరీశ్, చైతన్య ప్లస్ట్ క్లాస్ కాలేజ్, చెన్నారెడ్డి మెమోరియల్ కాలేజ్ లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మహ్మద్‌జుబేరా

పీడీఎఫ్ బియ్యం పట్టివేత



పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం ఆటో

బళ్లారి రూరల్, జూలై 23 : పీడీహళ్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రూపనగుడి గ్రామం వద్ద సోమవారం రాత్రి పీడీఎఫ్ రైస్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతపురం జిల్లా పాల్తూరు గ్రామం నుంచి బళ్లారి వైపు ఓ ఆటోలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎఫ్ రైస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఆటోపై కేసు నమోదు చేసినట్లు పీడీహళ్లి ఎస్ఐ నాగభూషణ తెలిపారు.

అగ్రికల్చర్ కళాశాలల ప్రైవేటీకరణ వద్దు



డాక్టర్ రమేష్ బీకేకి వినతిపత్రం అందిస్తున్న అగ్రికల్చర్ విద్యార్థులు

బళ్లారిరూరల్, జూలై 23 : బళ్లారి రూరల్ పరిధిలోని గవర్నమెంట్ వ్యవసాయ కళాశాలను ప్రైవేటీకరణ చేయరాదని మంగళవారం వ్యవసాయ విజ్ఞాన కేంద్రం హగరి అగ్రికల్చరల్ కళాశాల విద్యార్థులు అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థి సాత్విక్ మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాలు ఎంతో కష్టపడి చదువుకునే ఈ కళాశాలను ప్రైవేటీకరణ చేయడం వల్ల తమకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మనోజ్, చరణ్, మాంతేష్, రాకేష్, రామచంద్ర నిస్మిత, భావన సృష్టి సరస్వతి కవిత పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శోభారాణి

సిరుగుప్ప, జూలై 23 : తాలుకాలోని ఆదోని రోడ్డు మార్గంలో ఏఆర్ఎస్ ఫారమ్ వద్ద అక్రమ గంజాయి అమ్మకం చేస్తున్న ఐదు గురిని జిల్లా ఎస్పీ శోభారాణి ఆధ్వర్యంలో దాడులు జరిపి అరెస్టు చేశారు. 5.350 కిలోల గంజాయిని పోలీసులు వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ శోభారాణి మాట్లాడుతూ ఈ కేసులో సర్మస్ వలీ, శైలేంద్ర, హమీద్, బలరామ్, కార్తీక్‌లను అరెస్టు చేశామన్నారు. గంజాయి, ఇసుక, ఎర్రమట్టి అక్రమంగా రవాణా చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు. సిరుగుప్ప పట్టణ ఎస్ఐ వన్నప్ప కేసు నమోదు చేసుకున్నారు. డీఎస్పీ వెంకటేష్, సీఐ హనుమంతప్ప, ఎస్ఐ పరశురామ తదితరులు ఈ దాడుల్లో పాల్గొన్నారు.

వేతనాల కోసం నిరసన



బకాయిలు చెల్లించాలని మనవి పత్రం ఇస్తున్న మాజీ పంచాయతీ సభ్యులు

కంప్లి, జూలై 23 : తమకు 30 నెలల నుంచి వేతనాలు ఇవ్వలేదని వెంటనే తమకు వేతనాలు చెల్లించాలంటూ రామసాగర గ్రామ పంచాయతీ సభ్యులు పంచాయతీ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సభ్యుడు మంజునాథ మాట్లాడుతూ ఎన్నోసార్లు గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారికి మనవిపత్రం ఇచ్చినా ఇదిగో అదిగో అంటూ వాయిదా వేస్తూ వచ్చారన్నారు. ఇంతవరకు తమకు న్యాయం చేకూర్చలేదన్నారు. అలాగే 2023 డిసెంబర్ 19న, 2024 ఫిబ్రవరి 24, 27 తేదీలలో తాము జీతాలపై సమాచార హక్కు చట్టం కింద లేఖలు కూడా రాశామని, తమకు సరియైన సమాధానం కూడా రాలేదన్నారు. గతంలో తాలుకా ఈవో, జెడ్పీసీఈవోకు మనవిపత్రం అందించామని, వెంటనే చర్చించి తమకు పాత బకాయిలు చెల్లిస్తామని తెలిపారే గానీ ఇంతవరకు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కార్యదర్శి వీకే నాగరాజురావుకు వినతిపత్రం అందించారు. వెంటనే ఈ విషయం పీడీవోకు తెలియజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రామ పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

కంప్లి, జూలై 23 : కుడితిని పట్టణంలోని ఇందిరానగర్ సాయిబాబా ఆలయంలో రెండు రోజుల పాటు గురుపౌర్ణమి సందర్భంగా సాయిబాబాకు 86వ వివిధ ధార్మిక పూజలు జరిగాయి. మావుళి తుకారామ్ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ధార్మిక పూజలు జరిగాయి. ఈ కార్యక్ర మంలో పట్టణ వాసులు, మహిళలు పూజల్లో పాల్గొని స్వామివారికి మొక్కులు సమర్పించుకున్నారు. స్వామివారికి అమృతాభిషేకం, కాగడహారతి, సామూహిక సాయివ్రతాలు చేపట్టారు.

హోసూరు జోన్

మూడేళ్లలో మూడు సార్లు విద్యుత్ చార్జీల పెంపు



హోసూరులో అన్నాడీఎంకే తరపున ప్రదర్శన

హోసూరు, జూలై 23: మూడేళ్లలో మూడుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారని ఆరోపిస్తూ హోసూరు మున్సిపల్ విద్యుత్ బోర్డు కార్యాలయం ఎదుట కృష్ణగిరి జిల్లా అన్నాడీఎంకే పార్టీ తరపున ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి, మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. అన్నాడీఎంకే హయాంలో పన్ను రహిత ప్రభుత్వం అధికారంలో ఉందని ప్రస్తుతం పన్నులన్నీ పెంచారన్నారు. గత 60 ఏళ్లలో తమిళనాడు ప్రభుత్వ అప్పు రూ.4 లక్షల కోట్లు కాగా, డీఎంకే గత 4 ఏళ్లలో రూ.4 లక్షల కోట్ల రుణం తీసుకుని భారత దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలబెట్టింది. అన్నాడీఎంకే హాయంలో 80 లక్షల మంది మహిళలకు నెలకు రూ.1000 సాయం అందించగా, ఇప్పుడు డీఎంకే కోటి మంది మహిళలకు రూ.1000 ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సెక్రటరీలు రాజు, అశోక్‌రెడ్డి, వాసుదేవన్, మంజు, ఎంజీఆర్ ఫోరం జిల్లా సంయుక్త కార్యదర్శి జై.ప్రకాశ్, శాసనమండలి మాజీ సభ్యుడు రాజేంద్రన్, హోసూరు ఎమ్మెల్యేలు కుబేరన్ , శంకర్, లక్ష్మీహేమకుమార్, దిల్షిత్ రఘుమాన్, శివరామన్ రజిని కళావతి పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డుపై దాడి

హోసూరు (క్రైం) జూలై 23: హోసూరు బత్తలపల్లి ప్రాంతానికి చెందిన ప్రేమ్ ప్రకాశ్‌సింగ్ (28) ప్రైవేట్ కంపెనీ సెక్యూరిటీ గార్డుపై ఆ ప్రాంతంలోని ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో బంధువులు అతడితోవాగ్వాదానికి దిగారు. అలాగే అతన్ని కొట్టి గాయపరిచి బెదిరించారు. ఈ విషయంపై అతడు హోసూరు ప్రభుత్వ ఆసుపత్రిల్లో చికిత్స పొందుతూ హడ్కో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని ఆ ప్రాంతానికి చెందిన రాజీ(21), సతీష్ (20) అనే ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.


హోసూరులో అధునాతన ల్యాప్రోస్కోపీ టూల్

హోసూరు (సిఫ్‌కాట్) జూలై 23: బాగలూరు రోడ్డులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి ఐసీజీ కెమెరా ఇమేజింగ్‌ను పరిచయం చేసింది. ఇది ల్యాప్రోస్కోపిక్ శస్త్రచికిత్సలో అత్యాధునిక పరికరమని హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ కార్డియాలజిస్ట్ చంద్రమేలలి తెలిపారు. కొత్త అత్యాధునిక ల్యాప్రోస్కోపిక్ సదుపాయాన్ని హోసూరు టీవీఎస్ మోటార్స్ కంపెనీ ప్రిన్సిపల్ చీఫ్ డాక్టర్ అజిత్, అశోక్ లేలాండ్ డాక్టర్ బాలాజీ ప్రారంభించారు. జనరల్ ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ మంజునాథ్ కొత్త ఆధునిక ల్యాప్రోస్కోపిక్ పరికరం ఉపయోగించి చేసిన శస్త్రచికిత్స గురించి వివరించారు. దీని ద్వారా రక్తనాళాలు, శోషరస గ్రంథులు, కణతులను గుర్తించి అతి సులభంగా ఆపరేషన్ చేయవచ్చని తెలిపారు. ఈ అత్యాధునిక పరికరం భారతదేశంలోనే మొదటిదని, లింఫ్ నోడ్స్ ట్యూమర్లను గుర్తించి ఆపరేషన్ చేయవచ్చని తెలిపారు.



ల్యాప్రోస్కోపీ టూల్ గురించి వివరిస్తున్న డాక్టర్లు


బాల్య వివాహాలపై అప్రమత్తంగా ఉండాలి



బాల్యవివాహాలపై కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ శోభారాణి

బళ్లారి రూరల్, జూలై 23: ఇటీవల బాల్య వివాహాలు పెరుగుతున్న నేపథ్యంలో శిశు అభివృద్ధి శాఖ అధికారులు అప్రమత్తంగా వుండాలని బళ్లారి ఎస్పీ డాక్టర్ శోభారాణి హెచ్చరించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా పంచాయతీ శిశు అభివృద్ధి శాఖ, పోలీసు శాఖ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిషేధ చట్టంపై కార్యక్రమాన్ని బళ్లారి ఎస్పీ డాక్టర్ శోభారాణి చెట్టుకు నీరుపోసి ప్రారంభించారు. శిశు సంక్షేమ శాఖ అధికారి శ్రీ రాజేష్ కోసమని సీనియర్ సివిల్ జడ్జి పిల్లలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిల్లలు కష్టపడి చదివి పైస్థానికి పోవాలని బాల్యంలోనే వివాహాలు చేయరాదని చేసిన ఎడల వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చన ఎస్పీ రవి కుమార్, నవీన్ కుమార్, డిప్యూటీ డైరెక్టర్ మహిళా శిశు అభివృద్ధి శాఖ జలాలప్ప, డీఎస్పీ చంద్రకాంత్, నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దర్వేష్ కంపెనీపై కేసు నమోదు



ఎస్పీ పుట్టమాదయ్య

రాయచూరు, జూలై 23 : అధిక వడ్డీ ఆశతో డిపాజిట్లు స్వీకరించి ఖాతాదారులను ఆందోళనకు గురిచేసిన దర్వేష్ కంపెనీపై కేసు నమోదు చేశామని జిల్లా ఎస్పీ పుట్టమాదయ్య తెలిపారు. నగరంలోని తన కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడిన ఎస్పీ తాను జమ చేసిన సొమ్ము ఇవ్వాలంటూ నగరానికి చెందిన వెంకటేశ్ అనే వ్యక్తి అదే కంపెనీ ముందు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన నేపథ్యంలో జోక్యం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు. నగరానికి చెందిన వెంకటేశ్ దర్వేష్ కంపెనీలో లక్షల్లో డిపాజిట్ చేశాడని, ఆ కంపెనీకి చెందిన కార్యాలయం వద్దకు వెళ్లి విచారించగా అగ్రిమెంట్ బాండ్ తెమ్మని చెప్పారన్నారు. తీరా అది తీసుకువచ్చిన తర్వాత సిబ్బంది తెచ్చిన బాండ్ నకిలీదని చెప్పడంతో వెంకటేశ్ గొడవకు దిగాడన్నారు. ఈ క్రమంలో ఇరుగు-పొరుగుతో పాటు మిగతా ఖాతాదారులతో కలిసి వెంకటేశ్ గొడవ పడ్డాడని, ఈ నేపథ్యంలో అవమానానికి గురైన వెంకటేశ్ అక్కడే ఆత్మహత్యాయత్నంచేశాడన్నారు. దీంతో పోలీసులు వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారని, దర్యాప్తులో అన్నివాస్తవాలు వెలుగు చూస్తాయని త్వరలో వివరాలను వెల్లడిస్తామని ఎస్పీ తెలిపారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంపు...

అయ్యంకి వెంకట రమణయ్య (జయంతి)



'గ్రంథాలయ పితామహ'గా పేరొందిన అయ్యంకి వెంకట రమణయ్య 1890 జూలై 24న తూర్పు గోదావరి జిల్లా రామచంద్రపురం తాలూకా కొరుందురు గ్రామంలో జన్మించారు. గ్రంథాలయ ఉద్యమకారుడు, ఆయుర్వేదం, ప్రకృతి వైద్యంలో సిద్ధహస్తులు, పత్రికా సంపాదకులు. 1934-48మధ్య కోస్తా, ఆంధ్ర ప్రాంతాలలో అనేక గ్రంథాలయాలు ఏర్పాటుచేశారు. సరస్వతీ రమారమణ, గ్రంథాలయ విశారద వంటి బిరుదులు అందుకున్నారు. 1979లో అయ్యంకి లైబ్రరీ కమిటీ ఏర్పాటై ఏటా ఉత్తమ గ్రంథాలయ కార్యకర్తను సత్కరిస్తోంది. 'పద్మశ్రీ' పురస్కారం అందుకున్నారు. 1979 మార్చి 7న దివంగతులయ్యారు.

శ్రీవిద్య (జయంతి)



శ్రీవిద్య 1953 జూలై 24న మద్రాస్‌లో జన్మించారు. కర్ణాటక సంగీత గాయని వసంత కుమారి కుమార్తె. మళయాళ, తమిళంలో పేరొందారు. కాగా తెలుగు, కన్నడ, మళయాళంలలో 800కుపైగా సినిమాలలో నటించారు. తన సినిమాలకు తానే డబ్బింగ్ చెప్పుకొనేవారు. తల్లి ప్రోత్సాహంతో నేపథ్య గాయని గాను రాణించారు. బుల్లితెరపైనా, వెండితెరపైనా రాణించారు. ఉత్తమనటిగా పలు పురస్కారాలు, కళైమా మణి, కేరళ రాష్ట్ర సినీ అవార్డులు, తమిళనాడు రాష్ట్ర సినిమా అవార్డులు, ఫిల్మ్‌ఫేర్ అవార్డులు ఇతర పుర స్కారాలు అందుకున్నారు. 2006 అక్టోబరు 19న కన్నుమూశారు.

మనోజ్‌కుమార్ (పుట్టినరోజు)



బాలీవుడ్‌లో ప్రముఖ నటుడిగా పేరొందిన మనోజ్‌కుమార్ 1937 జూలై 24న జన్మించారు. అసలు పేరు హరికిషన్ గిరి గోస్వామి. 1967లో ఆయన దర్శకత్వం వహించిన 'ఉపకార్' సినిమా బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఉత్తమ దర్శకుడిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డు అందుకున్నారు. హిమాలయ్ కి గాడ్ మే, ఉప్ కార్, రోటీ కపడా ఔర్ మకాన్, సన్యాసి, క్రాంతి వంటి సినిమాలు ఎంతో పేరొందాయి. 40ఏళ్ల కెరీర్‌లో పద్మశ్రీ, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు, ఫిల్మ్‌ఫేర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుతోపాటు పలు పురస్కారాలు అందుకున్నారు.

అజీం ప్రేమ్‌జీ (పుట్టినరోజు)



విప్రో సంస్థ ఛైర్మన్, 'పద్మ విభూషణ్' గ్రహీత అజీం హాషం ప్రేమ్‌జీ 1945 జూలై 24న బాంబేలో జన్మించారు. ప్రముఖ వ్యాపార వేత్త. వంటనూనెల ఉత్పత్తితో కెరీర్‌ను ప్రారంభించి దేశంలో ప్రముఖ ఐటీ సంస్థగా ఎదిగేలా కృషి చేశారు. స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాలలో విద్యాభివృద్ధికి పాటుపడుతూ పలు సామాజిక సేవలందిస్తున్నారు. వారెన్ బఫెట్, బిల్‌గేట్స్ వంటి ప్రము ఖులతో ఒప్పందం చేసుకున్నారు. పద్మశ్రీ, పద్మ భూషణ్, పద్మవిభూషణ్ వంటి ఉన్నత పురస్కారాలు అందుకున్నారు. 2020లో నేషనల్ సెంటర్ ఫర్ బయలాజికల్ సైన్సెస్‌తో కలసి పలు పరిశోధనలకు సహకారం అందించారు.

పంకజ్ అద్వాని (పుట్టినరోజు)



'పద్మవిభూషణ్' గ్రహీత పంకజ్ అర్జున్ అద్వాని 1985 జూలై 24న పూనెలో జన్మించారు. బిలియర్డ్స్, స్నూకర్ గేమ్‌లో 27సార్లు వరల్డ్ చాంపియన్ అందుకున్నారు. ఏషియన్ అండ్ వరల్డ్ చాంపి యన్ షిప్స్‌లో అన్ని ఫార్మాట్‌లలో వరుసగా అత్యధిక అవార్డులు అందుకున్న ఏకైక వ్యక్తి. 18 బిలియర్డ్స్ వరల్డ్ టైటిల్స్ అందుకున్నారు. 2004లో అర్జున, 2006లో రాజీవ్ ఖేల్‌రత్న, 2009లో పద్మశ్రీ, 2018లో పద్మ విభూషణ్ పురస్కారం అందుకున్నారు. ఇంకా పలు టైటిల్స్, అవార్డులు పొందారు.

కేటీ రామారావు (పుట్టినరోజు)



కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) 1976 జూలై 24న సిద్దిపేటలో జన్మించారు. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు కుమారుడు. ప్రస్తుతం భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర అర్బన్ డెవలప్‌మెంట్, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, ఐటీ, ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ శాఖల మంత్రిగా వ్యవహరిం చారు. 2015లో సీఎన్ఎన్ ఐబీ ఎన్‌చే మోస్ట్ ఇన్స్పిరేషనల్ ఐకాన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు, స్కాచ్‌చే ఐటీ మినిస్టర్ ఆఫ్ 2017 అవార్డు అందుకున్నారు.

సామాజిక చైతన్యంలో హడపద అప్పణ్ణది ప్రత్యేక శైలి

విజయపుర, జూలై 23: పన్నెండో శతాబ్దంలోనే సామాజిక చైతన్యకారులలో ప్రముఖులైన బసవణ్ణకు కుడిభుజంగా వ్యవహరించిన హడపద అప్పణ్ణ తనదైన ప్రత్యేకత చాటుకున్నారని అఖిల కర్ణాటక మిత్రసంఘం రాష్ట్ర అధ్యక్షుడు చి.మా. సుధాకర్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని భరత్‌నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటైన కార్యక్రమంలో హడపద అప్పణ్ణ జయంతి నిర్వహించారు. సమాజంలోని మూఢనమ్మకాలపై బసవణ్ణతో కలసి చైతన్యం తెచ్చారన్నారు. జిల్లా శరణ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ విజయపుర జిల్లా తంగడగి గ్రామానికి చెందిన హడపద అప్పణ్ణ బాల్యంనుంచే బసవణ్ణ అనుచరుడిగా ఉండేవారన్నారు. అనుభవ మంటపంలో బసవణ్ణకు ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారన్నారు. హడపద అప్పణ్ణ భార్య లింగమ్మ కూడా వచనకారురాలిగా రాణించారన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యాధ్యక్షుడు బి విశ్వనాథ్, ప్రధానోపాధ్యాయుడు మునిఆంజనప్ప, ఉపాధ్యాయులు గుల్జార్ ఫాతిమా, మాలతి, సుకన్యా, జ్యోతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.



హడపద అప్పణ్ణ జయంతిలో సుధాకర్ తదితరులు

ధర్మం పాటిస్తేనే భగవంతుడి అనుగ్రహం



అణ్ణయ్యప్పస్వామికి సన్మానం

శిడ్లఘట్ట, జూలై 23: ధర్మాన్ని ఆచరించి పాటించడం ద్వారానే భగవంతుడి అనుగ్రహం సాధ్యమని కాళితనయ ఉమామహేశ్వర స్వామిజీ అభిప్రాయపడ్డారు. గురుపూర్ణిమ ఉత్సవాల్లో భాగంగా తాలూకాలోని మళమాచనహళ్లిలో పాపప్ని మఠం ఓంకార జ్యోతి ఆశ్రమానికి చెందిన కాళితనయ ఉమామహేశ్వరస్వామిజీ, అణ్ణయ్యప్ప స్వామిజీ, బ్రహ్మశ్రీ రామచందారెడ్డి స్వామి, వీరేగౌడ స్వామిలు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఉమామహేశ్వరస్వామిజీ మాట్లాడుతూ మానవాళి సంక్షేమానికి వేదాలు, శాస్త్రాలు, పురాణ ఇతిహాసాలు ఉన్నాయని వీటిలోని సారాన్ని అర్థం చేసుకుని జీవనానికి అన్వయం చేసుకుంటే భగవంతుడి అనుగ్రహం సాధ్యమన్నారు. ఇల్లే తొలి పాఠశాల అన్నారు. మొక్కై వంగనిది, మానై వంగునా అన్నారు. పూర్వం ఉమ్మడి కుటుంబాలలో అవ్వలు, తాతయ్యలు పిల్లలకు రామాయణ, మహాభారతాల గురించి వివరించి మంచి చెడులపై అవగాహన కల్పించేవారన్నారు. నేటి పిల్లలకు మన ఆచార వ్యవహారాల గురించి పెద్దలు చెప్పకపోవడంతోనే సమస్య ఏర్పడుతోందన్నారు. అంతకుముందు స్వామిజీలను బాలికలు నాదస్వర వాయిద్యాలాపనతో ఆత్మీయంగా స్వాగతించారు. అణ్ణయ్యప్ప స్వామిజీని బెంగళూరు వారాణసి ఆశ్రమానికి చెందిన బ్రహ్మశ్రీ రామచంద్రారెడ్డి వెండికిరీటంతో సత్కరించారు. కాంగ్రెస్ నాయకుడు, సమాజ సేవకుడు పుట్టు ఆంజినప్ప మాట్లాడుతూ మన సమస్యల పరిష్కారానికి గురువుల ఆశీర్వాదం పొందాలని, పెద్దల సలహా సూచనలు పాటించాలన్నారు. మండపంలో కైవార యోగినారేయణ తాతయ్య, షిర్డీసాయిబాబాల మూర్తులను ప్రతిష్ఠించారు. గ్రామంలోని బ్యాటరాయస్వామి, శివపార్వతి, ఆంజనేయస్వామిలకు ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. భజన బృందాలచే రాత్రి విశేషభజన సాగింది. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

కోచిముల్ విభజనపై వాగ్వాదం



సమావేశం ప్రారంభంలో ప్రముఖులు

బాగేపల్లి, జూలై 23: కోలారు - చిక్కబళ్లాపుర మిల్క్ ఫెడరేషన్ (కోచిముల్) విభజన అశాస్త్రీయంగా ఉందని అధ్యక్షులు, డైరెక్టర్ల మధ్య వాగ్వాదం నెలకొంది. బాగేపల్లి పట్టణ శివారులోని సూర్య కన్వెన్షన్‌హాల్ కోచిముల్ సామాన్య సభ మంగళవారం జరిగింది. కోచిముల్ విభజన అంశంపై డెయిరీ అధ్యక్ష, డైరెక్టర్ల మధ్య వాగ్వాద జరిగింది. కోచిముల్ పాలకవర్గాన్ని రెండుగా విభజించి కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఎన్నికలు నిర్వహిం చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కోచిముల్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే వై.ఎ.నంజేగౌడ వెల్లడించారు. కోచిముల్ విభజనపై కోర్టులో కేసు నడుస్తోందని, కోర్టు సూచన మేరకు రాష్ట్ర ప్రభుత్వం రానున్న రోజుల్లో కోచిముల్‌ను విభజించే అంశంపై పాడి రైతులు ఎలాంటి సందేహాలు అవసరం లేదన్నారు. చిక్కబళ్లాపుర జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా వ్యవహరించిన ప్రస్తుత ఎంపీ డాక్టర్ కే సుధాకర్ బీజేపీ అవధిలో ప్రభుత్వ నియమాలను గాలికి వదిలి కోచిముల్‌ను విభజించారన్నారు. విభజన సమయంలో పాలప్యాకెట్ల తయారీ నూతన విభాగం సహా ఆర్థిక సమస్యలకు పరిష్కారం చూపేలా చీముల్ ఏర్పాటుపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. రైతుల పాలధర తగ్గించడంపై మీడియా అడిగిన ప్రశ్నకు నంజేగౌడ మండిపడ్డారు. అధ్యక్షుల అందరి హయాంలోనూ పాలధర తగ్గించారన్నారు. మా హయాంలో మాత్రం పాలధర తగ్గించే అంశాన్ని ప్రస్తావించడం సరికాదన్నారు. కోచిముల్ మాజీ డైరెక్టర్ కేవీ నాగరాజ్ మాట్లాడుతూ కోచిముల్ విభజనకు రెండుసార్లు కోర్టు నుంచి స్టే తెచ్చి విభజన చేశారని కోచిముల్ సమాఖ్యను రద్దు చేసి విభజనకు అడ్డుపడ్డారన్నారు. కోచిముల్ పాలకవర్గం అవధి మే 12కు ముగిసిందని, పాలకవర్గం గడువు ముగిసి రెండు నెలలైనా డైరెక్టర్ల స్థానాలకు ఎన్నికలు నిర్వహించకుండా జాప్యం చేస్తున్నారన్నారు. సమావేశంలో డైరెక్టర్లు మంజునాథరెడ్డి, హరీశ్, కేఎన్ నాగరాజు, జయసింహకృష్ణప్ప, హనుమేశ్, అశ్వత్థనారాయణబాబు, వెంకటేశ్, కాంతరాజు, ఆదినారాయణరెడ్డి, కాంతమ్మ, సునందమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని డీఎస్ఎస్ నిరసన

శిడ్లఘట్ట, జూలై 23: పలు డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ దళిత సంఘర్ష సమితి (డీఎస్ఎస్) ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. శిడ్లఘట్ట పట్టణంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనాన్ని పది కోట్ల రూపాయలతో త్వరగా నిర్మించాలని, బగర్‌హుకుం సమితి ఏర్పాటు చేసి తాలూకా వ్యాప్తంగా అర్జీ నమూనా 50, 53, 57లలో పెండింగ్‌లలో ఉన్న వినతులను పరిష్కరించాలని డీఎస్ఎస్ డిమాండ్ చేసింది. తాలూకా వ్యాప్తంగా రైతులకు అటవీశాఖ నుంచి వస్తున్న ఇబ్బందులకు బ్రేక్ వేయాలని డిమాండ్ చేశారు. అర్హులైనవారికి ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించి హక్కుపత్రాలను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. తాలూకా ప్రభుత్వ ఆసుపత్రులో ఉన్న లోపాలను సరిచేయాలన్నారు. సాదలి మెయిన్‌రోడ్డు ఆక్రమణలను తొలగించి రోడ్డు విస్తరణ చేపట్టాలన్నారు. దళితవాడలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, స్మశాన వాటిక మంజూరు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ బిఎన్ స్వామికి వినతిపత్రం సమర్పించారు. నిరసనలో డీఎస్ఎస్ రాష్ట్ర సంచాలకులు ఎన్ వెంకటేశ్, కేసీ రాజాకాంత్, జిల్లా సంచాలకులు గంగప్ప, బీవీ వెంకటరమణ, ఎన్ఎ వెంకటేశ్, ఆనంద్, నరసింహమూర్తి, ఎం దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.



డీఎస్ఎస్ ఆధ్వర్యంలో నిరసన

హైస్కూల్లో వినియోగదారుల క్లబ్ ఏర్పాటు



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు, ఉపాధ్యాయలు

చింతామణి, జూలై 23: తాలూకాలోని బట్లహళ్లి ప్రభుత్వ హైస్కూల్‌లో వినియోగదారుల హక్కులపై జాగృతి కల్పించే ఉద్దేశ్యంతో ప్రత్యేకంగా వినియగదారుల క్లబ్‌ను ఏర్పాటు చేసినట్టు ప్రధానోపాధ్యాయుడు ఆర్ జనార్ధన్ వెల్లడించారు. తాలూకాలోని బట్లహళ్లి ప్రభుత్వ హైస్కూల్‌లో మంగళవారం క్లబ్‌ను లాంఛనంగా ప్రారంభించి విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. క్లబ్ తరపున పాఠశాలలో ప్రతివారం వక్తృత్వ పోటీలు, చర్చాగోష్ఠి, వ్యాసరచన పోటీలు, క్విజ్, నాటకం, జాథా ఇలా తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ఇటీవల కొన్ని వ్యాపారాలలో చోటు చేసుకున్న అక్రమాలు, నిర్ణీత ధరకంటే ఎక్కువ రేటుకు విక్రయించడం, తూకాలలో మోసం, నాణ్యత లేకపోవడం, అక్రమ నిల్వలు చేసి ధరలు పెరిగేలా చేయడం, వినియోగదారుల హక్కుల రక్షణ, వారి సమస్యలు ఆలకించడం, సమాచారం పొందడం, వినియోగదారుల సంరక్షణా చట్టం 1986 గురించి విద్యార్థులు ప్రస్తావించారు. వివిధ పోటీల విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందచేశారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవం, కన్స్యూమర్ కోర్టుపై అవగాహన, సమస్యల పరిష్కారానికి పాటించే విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల వినియోగదారుల క్లబ్ సభ్యులు, ప్రధానోపాధ్యాయుడు ఆర్ జనార్ధన్, క్లబ్ సంచాలకులు, టీచర్లు సురేశ్, లియాఖత్ అలి, రామాంజనేయ, మమత, వనిత తదితరులు పాల్గొన్నారు.

'కన్నడిగులకు రిజర్వేషన్లు కల్పించాలి'

దొడ్డబళ్లాపుర, జూలై 23: ప్రైవేట్ సంస్థలు, ఫ్యాక్టరీలలో ఉద్యోగాలలో కన్నడిగులకు రిజర్వేష్ కల్పించడంలో దశాబ్దాలుగా అన్యాయం జరుగుతోందని ఇకనైనా అమలు చేయాలని కన్నడ పక్ష రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంజీవ్‌నాయక్ డిమాండ్ చేశారు. పట్టణంలోని తాలూకా కార్యాలయం వద్ద కన్నడపక్ష ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు ఐదు దశాబ్దాలుగా కన్నడిగులకు ఉద్యోగాల రిజర్వేషన్‌లో అన్ని ప్రభుత్వాలు కన్నడిగుల ధ్వనిని పట్టించుకోకుండా పారిశ్రామికవేత్తలకు మద్దతుగా నిలిచాయని ఆరోపించారు. డాక్టర్ సరోజిని మహిషి నివేదిక ప్రకారం కన్నడిగులకు ప్రైవేట్ సంస్థల్లో రిజర్వేషన్‌లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆంజనేయ మాట్లాడుతూ ఇటీవల మంత్రివర్గ సమావేశంలో ఉద్యోగుల రిజర్వేషన్‌పై ప్రస్తావన వచ్చినా ఐటీబీటీ కంపెనీల ఒత్తిడితో ఆ నిర్ణయాన్ని విరమించుకున్నారన్నారు. ఇకనైనా ముఖ్యమంత్రి ఈ అంశంపై స్పష్టత ఇచ్చి కన్నడిగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. నిరసనలో కన్నడపక్ష మోహన్‌కుమార్, తాలూకా అధ్యక్షుడు వెంకటేశ్, ఉమాశంకర్, సిద్దరాజు, మంజునాథ, నరసింహమూర్తి, గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.



తాలూకా కార్యాలయం వద్ద కన్నడపక్ష నిరసన

అయ్యప్ప మందిరంలో రామాయణ పారాయణం

బెంగళూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మెజస్టిక్‌లోని అయ్యప్పమందిరంలో రామా యణ పారాయణం జరిగింది. కర్ణాటక నాయర్ సర్వీస్ సొసైటీ (కేఎన్ఎస్ఎస్) మల్లేశ్వరం అధ్యక్షులు ప్రేమ్‌చంద్ ఆధ్వర్యంలో జరిగిన పారాయణానికి అయ్యప్పభక్తులు, నాయర్ సామాజికవర్గానికి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. కరయోగం మహిళా విభాగం ఆధ్వర్యంలో పారాయణ సాగింది. కేఎన్ఎస్ఎస్ సభ్యుడు అడ్వకేట్ విజయ్‌కుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలు సుధా కరుణాకరన్, సెక్రటరీ రాధా గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



పారాయణంలో పాల్గొన్న సభ్యులు

మోటార్లు మాయం

ఉరవకొండ, జూలై 23: మండలంలోని నింబగల్లు సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ సమీపంలో ఉన్న సీపీడబ్ల్యూఎస్ఎస్ స్కీంకు సంబంధించిన మోటార్లు మాయమయ్యాయి. సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ సమీపంలో నీటి పంపింగ్‌కు సంబంధించిన మూడు గదులలో ఎనిమిది మోటార్లు ఉండాల్సి ఉండగా ఆరు మాత్రమే ఉన్నాయి. మిగిలిన రెండు ఎక్కడికి పోయాయో అధికారులకు అంతుచిక్కడం లేదు. పంప్‌హౌస్ గదులలోని 25హెచ్‌పీ మోటార్లు, 30హెచ్‌పీ మోటారు ఒకటి కనిపించడం లేదు. మోటార్ల విలువ సుమారు రూ.1.5లక్షల దాకా ఉంటుంది. మోటార్ల మాయం వెనుక గతంలో ఆర్‌డబ్ల్యూఎస్ స్కీం నిర్వహణకు సంబంధించిన వైసీపీకి అనుకూలమైన కాంట్రాక్టర్, సిబ్బంది ప్రమేయం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత కాంట్రాక్టర్ మోటారు తీసుకెళ్తున్న సమయంలోనూ కొంత మంది సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. నీటి పంప్‌హౌస్‌లోని ఫ్యూజు వైర్లు, విద్యుత్ సరఫరాకు సంబంధించిన వైర్లను కూడా కత్తిరించి ఎత్తుకెళ్లారు. వీటి విలువ కూడా రూ.లక్షలకు పైమాటే. అధికారులు కాంట్రాక్టర్‌కు వత్తాసు పలకడం వల్లనే, ఆయన ఇష్టారాజ్యంగా వ్యవహరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మోటార్లు లేని విషయం తమ దృష్టికి వచ్చిందని విచారణ చేసి బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటామని డీఈ పేర్కొన్నారు.



మూడు మోటార్లు ఉండాల్సిన చోట.. రెండే..

పెండింగ్ డబ్బులు త్వరలో జమ

అనంతపురం అర్బన్, జూలై 23: వాహన యజమానులకు పెండింగ్ డబ్బులను త్వరలోనే జమ చేసేలా చర్యలు తీసుకుంటామని జిల్లా ట్రాన్స్ పోర్టు అధికారి వీర్రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల వరకు రెవెన్యూ శాఖకు ఏర్పాటు చేసిన వాహనాలకు సంబంధించి రూ.2.08 కోట్లను ఆయా వాహనదారుల ఖాతాలకు జమ చేశామన్నారు. ఎన్నికల తర్వాత రెవెన్యూ, పోలీసు శాఖలకు ఏర్పాటు చేసిన వాహనాలకు సంబంధించి ఇంకా రూ.33 లక్షలు పెండింగ్‌లో ఉందన్నారు. ఎన్నికల ముందు వరకు పోలీసు శాఖకు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన వాహనాలకు సంబంధించి ఇది వరకే రూ.36 లక్షలు జమైందన్నారు. వివిధ నియోజకవర్గాల్లో పోలీసులకు ఏర్పాటు చేసిన వాహనాలకు రూ.28 లక్షలు జమ చేయాల్సి ఉందన్నారు. ఈ విషయంలో వాహనదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

ఏపీజీఎల్ఐ సమస్యలను పరిష్కరించాలి

అనంతపురం విద్య, జూలై 23: ఉపాధ్యాయుల ఏపీజీఎల్ఐ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్టీయూ నాయకులు ఏపీజీఎల్ఐ డీడీ భాస్కర్ తేజనాథ్‌ను కోరారు. సంగమేష్ నగర్ సమీపంలోని కార్యాలయంలో మంగళవారం ఆయనను కలిశారు. ఏపీజీఎల్ఐ ఫైనల్ పేమెంట్లు ఉద్యోగులకు త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రుణాలు, మిస్సింగ్స్ క్రెడిట్స్, ఇప్పటికే దరకాస్తు చేసిన అన్ని బాండ్ల క్లెయిమ్స్‌ను కూడా వెంటనే పరిష్కరించాలని విన్నవించారు. నాయకుల డిమాండ్లపై ఆయన సానుకూలంగా స్పందించారు.

మెజిస్ట్రేట్ కోర్టులో న్యాయవాదిపై హత్యాయత్నం

బెంగళూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు మెజి స్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో న్యాయవాదిపై చాకుతో పొడిచి హత్యకు ప్రయత్నించిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. వెంటనే ఆరోపితుడిని హలసూరుగేట్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గాయపడ్డ న్యాయవాది విమలను స్థానిక ఆసుపత్రికి తరలించారు. న్యాయవాది విమల, ఆరోపితుడు జయరాం రెడ్డి స్నేహితులు. విమలతో గడిపిన దృశ్యాలను అతడు వీడియో చేసుకున్నాడు. ఆమెనుంచి దాదాపు కోటిన్నర దాకా నగదు పొందినట్టు తెలుస్తోంది. నగరపరిధిలోని హెబ్బాలలో ఉండే భూమికి సంబంధించిన విషయంలో ఇరువురి మధ్యా వివాదం చెలరేగింది. ఆ తర్వాత న్యాయవాది విమల శేషాద్రిపురం పోలీస్‌స్టేషన్‌లో దౌర్జన్యం, భూమికి సంబంధించి ఫిర్యాదు చేశారు. సదరు కేసు విచారణలకోసం మంగళవారం ఇద్దరూ హాజరయ్యారు. కోర్టు హాల్ 1లోనే చాకుతో విమలపై జయరాం రెడ్డి దాడి చేశాడు. సెంట్రల్ విభాగం డీసీపీ శేఖర్ వివాదానికి సంబంధించిన సమాచారం తెలుసుకుంటున్నారు.

గంగావళి నది సమీపంలో మహిళ మృతదేహం

బెంగళూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఉత్తరకన్నడ జిల్లా శిరూరు ప్రాంతంలో కొండచరియలు విరిగిపడిన ఘటనలో గంగావళి నదికి అనుబంధమైన ప్రాంతంలో మహిళ మృతదేహాన్ని గుర్తించారు. మంగళవారం తెల్లవారుజామున సహాయక చర్యల్లో భాగంగా కొనసాగుతున్న ప్రక్రియలో మహిళ మృతదేహాన్ని గుర్తించారు. ఆమెను సణ్ణిహనుమంతగౌడగా నిర్ధారించారు. ఆమె ధరించిన బట్టల ఆధారంగా సణ్ణిహనుమంతగౌడగా గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. దీంతో ప్రమాదంలో 8మంది మృతదేహాలను గుర్తించినట్టు అయ్యింది. సహాయక చర్యల్లో మరాఠా రెజిమెంట్ మిలిటరీ బృందం రంగంలోకి దిగింది. కమాండెంట్ అభిషేక్ కశ్యప్ నేతృత్వంలో గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ (జీపీఆర్) ఉపయోగించి సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. మట్టి చరియల కింద లారీ కూరుకుపోయి ఉంటుందని సంబంధిత యజమానుల ఫిర్యాదు మేరకు జీపీఆర్ ద్వారా గుర్తించారు. మట్టి చరియలు విరిగిపడి ఏడు రోజులైనా సహాయక చర్యలు వేగవంతంగా సాగడం లేదని, అధికారుల నుంచి స్పందన లేదని లారీ డ్రైవర్ కేరళకు చెందిన అర్జున్ కుటుంబీకులు ఆక్రోశం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు మరిన్ని బలగాలను రంగంలోకి దింపారు.

చోరీలపై అప్రమత్తం



శ్రీనగర్ వాసులతో పోలీసుల సమాలోచనలు

బంగారపేట, జూలై 23: బంగారపేట పట్టణంలోని శ్రీనగర్‌లో ఇటీవల టోపిగ్యాంగ్ చోరీతో ప్రజలు బెంబేలెత్తారు. ఈ నేపథ్యంలో కెజిఎఫ్ జిల్లా పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. పట్టణంలోని శ్రీనగర్‌ను పరిశీలించి స్థానికులను పరామర్శించారు. వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించేలా భరోసా ఇచ్చారు. అపరిచిత వ్యక్తులను గుర్తిస్తే వెంటనే 112 లేదా స్థానిక పోలీసులకు సమాచారమిస్తే నిమిషాల్లోనే మీ ప్రాంతానికి చేరుకుంటారన్నారు. శ్రీనగర్ ప్రాంతంలో రాత్రి వేళల్లో గస్తీని కల్పించారు. అడ్రెస్ అడిగే నెపంతో ఒంటరి మహిళ నగలను దోచుకోవడం వంటి ఘటనలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఒంటరిగా ఉండేవారు లేదా తాళం వేసి బంధువుల ఇళ్లకు లేదా ఊర్లకు వెళ్లేవారు తమ సమాచారాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌లో తెలపడం ద్వారా నిఘాను పెంచేందుకు వీలవుతుందన్నారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నంజప్ప, ఎస్ఐ రాజణ్ణ సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్ర, బిహార్‌కే బడ్జెట్‌లో ప్రాధాన్యం

పావగడ, జూలై 23: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేవలం ఆంధ్రప్రదేశ్, బిహార్ రాష్ట్రాలకే ప్రాధాన్యం ఇచ్చారని కర్ణాటక బుద్ధసంఘం, అంబేడ్కర్ సంఘం నాయకులు మంగళవారం పావగడలో నిరసన వ్యక్తం చేశారు. కర్ణాటకను అన్నివిధాలా మోసం చేస్తూ ఆ రెండు రాష్ట్రాలకే అధిక నిధులు కేటాయించడం దారుణమన్నారు. వెనుకబడిన కర్ణాటకకు అన్యాయం చేశారని దళిత సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

5న సీఎం ఇంటి ఎదుట ధర్నా

పావగడ, జూలై 23: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆగస్టు 5న కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఇంటి ముందు ధర్నా చేయనున్నట్లు ఏఐటీయుసీ జిల్లా కన్వీనర్ గిరీష్ ప్రకటించారు. మంగళవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల కష్టాలను పరిష్కరించేందుకు నిధులున్నప్పటికీ వాటిని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. రెండేళ్లనుంచి కార్మికుల బిల్లులకు మోక్షం కలిగించకుండా నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. సీఎం ఇంటి ముట్టడితోనే సమస్యలు పరిష్కారం అవుతాయని భావిస్తున్నామన్నారు. కార్మికులంతా బెంగళూరుకు తరలిరావాలని పిలుపునిచ్చారు.